సాక్షి పార్వతీపురం మన్యం

ఆదివారం । 21 । ఏప్రిల్ । 2024



హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధ

హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని పార్వతీపురం మన్యం జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి బగాది జగన్నాథరావు సూచించారు. - 8లో



సర్కారు వారి సాయంతో..!

నిరుద్యోగ యువతకు ఆసక్తి ఉన్న రంగాల్లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలిగేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వారికి సాయం చేస్తూ బాసటగా నిలుస్తోంది. - 8లో

25న గురుకుల ప్రవేశ పరీక్ష

పార్వతీపురం టౌన్: 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి ఈ నెల 25న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పగడాలమ్మ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. 5,6,7,8, తరగతులకు ఏపీఆర్ఎస్ సీఏటీ ఉదయం 10గంటల నుంచి 12 గంటల వరకు, కళాశాలలకు ఏపీఆర్‌జేసీ అండ్ డీఈసెట్ మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. ఈ పరీక్షకు సంబంధించి హాల్ టికెట్‌లను హెచ్‌టీటీపీఎస్:ఏపీఆర్ఆర్ఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

న్యూస్‌రీల్

మే 11న జాతీయ లోక్ అదాలత్

- జిల్లా రెండవ అదనపు జడ్జి దామోదరరావు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా రెండవ అదనపు జడ్జి ఎస్ దామోదరరావు

పార్వతీపురం టౌన్: వచ్చే నెల 11న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా రెండవ అదనపు జడ్జి ఎస్ దామోదరరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన కోర్టు ప్రాంగణంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం కోర్టు ప్రాంగణంలో జరుగుతుందని, కక్షిదారులు ఈ కార్యక్రమంలో పాల్గొని వారి కేసులు రాజీ చేసుకోవచ్చని చెప్పారు. రాజీ చేసుకోవడం వల్ల సమయం, డబ్బు ఆదా చేసుకోవచ్చని సూచించారు. కోర్టుల చుట్టూ తిరగకుండా సాధ్యమైనంత మేరకు కేసులను రాజీ చేయడానికి ప్రయత్నిస్తామని తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అధిక సంఖ్యలో పాల్గొని పెండింగ్ కేసులు రాజీ చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.రమేష్, ఫస్ట్ క్లాస్ అడిషినల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ డి.సౌజన్య, బార్ కౌన్సిల్ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో ఉపశమనం



భామిని: ఈదురు గాలులతో కురుస్తున్న వర్షం

భామిని: అగ్నిగుండంలా మండుతున్న వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. శనివారం సాయంత్రం భామిని మండలంలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో మండల ప్రజలకు కాస్త ఉపశమనం కలిగింది. ఉరుములు, మెరుపులతో కూడిన గాలి వానతో ఎండ తీవ్రత నుంచి కాస్త ఊరట కలిగింది.

పాచిపెంటలో..వడగళ్ల వాన

సాలూరు:విలవిల్లాడుతున్న సాలూరు పట్టణం, పాచిపెంట మండల ప్రజలు శనివారం సేదదీరారు. మధ్యాహ్నం గాలులతో కూడిన వడగళ్ల వర్షం పడడంతో ప్రజలంతా చల్లని వాతావరణంతో ఉపశమనం పొందారు. పాచిపెంట మండలంలోని పి.కోనవలస తదితర ప్రాంతాల్లో చెట్లు నేలకొరగడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.



సాలూరు: పాచిపెంటలో కూలిపోయిన చెట్టు

బోర్డు పోయి.. టీవీ వచ్చే..!



జియమ్మవలస జెడ్పీ ఉన్నత పాఠశాలలో డిజిటల్ తరగతులను పరిశీలిస్తున్న అధికారులు

గతమంతా తోలుబొమ్మలాడిన తెర.. కన్నులు గప్పిన పొర..వర్తమానం కళ్లముందు వాస్తవం. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాల అంటే చాక్‌పీస్..బ్లాక్‌బోర్డు ప్రధాన పాత్ర పోషించేవి. ప్రస్తుతం వాటితో పనిలేకుండా పాఠశాలల్లో పూర్తిస్థాయిలో డిజిటల్ బోధన అందుబాటులోకి వచ్చేసింది. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా కార్పొరేట్ బడులకు దీటుగా, అంతకు మించి పూర్తి స్థాయిలో ప్రభుత్వ స్కూల్స్‌లో బోధన పద్ధతుల్లో సమూల మార్పులు వచ్చాయి.

- ప్రభుత్వ స్కూల్స్‌లో అమలవుతున్న స్మార్ట్ విద్య
- విద్యావ్యవస్థలో సాంకేతిక విప్లవం
- 3,4,5 తరగతి విద్యార్థులకు స్మార్ట్‌టీవీల ద్వారా విద్యాబోధన
- ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఐఎఫ్‌పీఎస్ టీవీల ద్వారా విద్య
- 8వ తరగతి దాటిన విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లు

పార్వతీపురం టౌన్: ఒకప్పుడు ప్రభుత్వ బడులంటే సరైన మౌలిక వసతులు ఉండవనే పరిస్థితి నుంచి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక విద్యారంగంలో సమూల మార్పులు వచ్చాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ప్రభుత్వ బడుల గురించి ప్రత్యేకంగా మాట్లాడుకునే రోజులు వచ్చాయి. దీనంతటికీ కారణం మనబడి నాడు-నేడు కార్యక్రమంతో కోట్లాది రూపాయలు ఖర్చు చేసి మౌలిక వసతులు కల్పించడం, చకచకా మారుతున్న డిజిటలైజేషన్ విధానమే. ప్రపంచస్థాయిలో పోటీ పడేందుకు ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్‌లో లేనివిధంగా రూ.కోట్లు ఖర్చుచేసి ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్, బైజూస్ కంటెంట్‌తో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు, స్మార్ట్ టీవీలను తీసుకువచ్చి విద్యా వ్యవస్థలో సాంకేతిక విప్లవం తీసుకువచ్చింది. నిరంతరాయంగా డిజిటల్ బోధన అందించేందుకు, సమకాలీన ప్రపంచ పోకడలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు అన్ని పాఠశాలలను డిజిటలైజేషన్ చేస్తున్నారు. ఇందుకోసం ప్రతి పాఠశాలకు ప్రభుత్వం ఇంటర్నెట్ సదుపాయాన్ని కల్పించింది.

557 స్కూల్స్‌కు 1801 స్మార్ట్ టీవీలు

పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా నాడు-నేడు పనులు చేపట్టిన 557 ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు తొలి, రెండవ విడతల్లో 1801 స్మార్ట్‌టీవీలు, ఐఎఫ్‌పీ స్మార్ట్ టీవీలు అందుబాటులోకి తీసుకువచ్చారు. తొలివిడతలో 221 ప్రాథమిక పాఠశాలలకు 928 ఐఎఫ్‌పీ స్మార్ట్ టీవీలు వచ్చాయి. రెండవ విడతలో 336 పాఠశాలలకు 873 ఐఎఫ్‌పీఎస్ స్మార్ట్‌టీవీలు పాఠశాలలకు అందించారు. ఇవన్నీ ఆయా స్కూల్స్‌లోని తరగతి గదుల్లో ఏర్పాటు చేశారు. వాటి ద్వారానే ప్రస్తుతం బోధన సాగిస్తున్నారు.



తరగతి గదుల్లో విద్యార్థులు



పార్వతీపురం మండలం ఎమ్మార్‌నగరంలో డిజిటల్ తరగతులు పరిశీలిస్తున్న అధికారులు

బైజూస్ కంటెంట్‌తో ఇన్‌స్టాల్ చేసిన ట్యాబ్‌లు

బైజూస్ కంటెంట్‌తో ఇన్‌స్టాల్ చేసిన ట్యాబ్‌లను ఎనిమిదో తరగతి విద్యార్థులకు, బోధించే ఉపాధ్యాయులకు ప్రభుత్వం అందజేస్తోంది. వరుసగా రెండో ఏడాది కూడా ట్యాబ్‌లు పంపిణీ చేసింది. గతేడాది జిల్లాలో విద్యార్థులకు 8183 ట్యాబ్‌లు పంపిణీ చేసి రూ.35.23 కోట్లు ఖర్చు చేసింది. ఈ విద్యా సంవత్సరం ఎనిమిదో తరగతి విద్యార్థులకు 9,898 ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ట్యాబ్‌లు అందజేసే సందర్భంలో ప్రతి ట్యాబ్‌ను కూడా మూడేళ్ల వారంటీతో కొనుగోలు చేశారు. విద్యార్థులు ట్యాబ్‌లు ఉపయోగించే క్రమంలో అనుకోని పక్షంలో జరిగే స్క్రీన్ డ్యామేజీకి కూడా ప్రభుత్వమే రిపేర్ చేయించేలా చర్యలు చేపట్టారు.

జిల్లాలో అందించిన స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌పీ ప్యానళ్ల వివరాలు

మండలం	సాంకేతిక పరికరాలు అందించిన పాఠశాలలు	తొలివిడతలో ట్యాబ్‌ల పంపిణీ	రెండవ విడతలో ట్యాబ్‌ల పంపిణీ
బలిజిపేట	33	36	50
భామిని	33	46	55
గుమ్మలక్ష్మీపురం	48	96	41
గరుగుబిల్లి	31	31	72
జియ్యమ్మవలస	25	41	36
కొమరాడ	27	41	80
కురుపాం	30	78	25
మక్కువ	30	41	49
పాచిపెంట	42	82	46
పాలకొండ	27	39	77
పార్వతీపురం	55	99	86
సాలూరు	51	95	83
సీతంపేట	68	116	65
సీతానగరం	20	49	27
వీరఘట్టం	37	38	81

పాఠశాలలో పూర్తిగా డిజిటల్ బోధన



గతంలో మా పిల్లలు చదువుతున్న పాఠశాలలో బ్లాక్ బోర్డులు మాత్రమే ఉండేవి. నాడు-నేడు పనులు చేపట్టిన స్కూల్స్‌కు స్మార్ట్ టీవీలు అందజేశారు. వాటిద్వారానే తరగతులు బోధించారు. ఈ డిజిటల్ విద్య వల్ల విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలలకు గట్టి పోటీ ఇచ్చి పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరుస్తున్నారు.

–ఎ.మాలతి, విద్యార్థి తల్లి, పార్వతీపురం

గతంలో ప్రభుత్వ పాఠశాల అంటే భయం



గతంలో ప్రభుత్వ పాఠశాల అంటే పిల్లలను పంపడానికి భయపడేవాళ్లం. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ పరిస్థితి పూర్తిగా మారింది. నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాలల రూపురేఖలు మార్చడమే కాకుండా పాఠశాలలో డిజిటల్ విధానంలో బోధిస్తున్నారు. పిల్లలు కార్పొరేట్ స్కూల్స్‌కు గట్టి పోటీ ఇస్తున్నారు.

–డి. వెంకటలక్ష్మి, విద్యార్థి తల్లి, పాలకొండ

ప్రభుత్వ పాఠశాలలు బాగుపడ్డాయి



జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ పాఠశాలలు బాగుపడ్డాయి. విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చారు. పిల్లలకు ట్యాబ్‌లు, పాఠశాలల్లో స్మార్ట్ టీవీల ద్వారా విద్యను బోధిస్తున్నారు. సమకాలీన ప్రపంచ పోకడలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు డిజిటలైజేషన్ చేయడం అభినందనీయం.

–పొందూరు లలిత, విద్యార్థిని తల్లి, పార్వతీపురం

ఉత్తరాంధ్ర ప్రాంతీయ చిత్రానికి ఆడిషన్స్



ఆడిషన్స్ నిర్వహిస్తున్న సంస్థ నిర్వాహకులు

విజయనగరం క్రైమ్:

ప్రముఖ సినీ నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తున్న ఉత్తరాంధ్ర ప్రాంతీయ చిత్రానికి సంబంధించి పట్టణంలోని కణపాక యూత్ హాస్టల్‌లో రెండు రోజుల పాటూ నటీనటుల ఎంపికకు సంబంధించి ఆడిషన్స్ నిర్వహిస్తున్నామని సంస్థ ప్రతినిధి జానకీరామ్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన ఆడిషన్స్‌లో నటులు అద్భుతమైన నటనాప్రదర్శన ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జానపద కళాకారిణి జీవితంలో యథార్థ సంఘటనలు ఆధారంగా చేసుకుని రూపొందిస్తున్న చిత్రానికి కళాకారులను ఎంపిక చేస్తున్నామన్నారు. ఉత్తరాంధ్ర మాండలికంతో పాటు కిన్నెర, జముకుల కథ, తప్పెట గుళ్లు, వీధి నాటక కళాకారులు కూడా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించేందుకు ఇదొక సువర్ణ అవకాశమన్నారు.

21న ఆదివారం కూడా ఆడిషన్స్ ఉంటాయన్నారు. 22, 23 తేదీల్లో విశాఖ సిటీ బీచ్ రోడ్డులో వైఎంసీఏ అపోజిట్‌లో ఉన్న యూత్ హాస్టల్, వైఎస్‌సీపీ కిర్లంపూడి లేఅవుట్ వద్ద జరుగుతాయన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వికాస్, గాయకులు జానకీరామ్, నంది అవార్డు గ్రహీత తిరుపతినాయుడు మాస్టారు, గెద్ద వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లతో మమేకం

- జోరుగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ప్రచారం

ప్రచార పర్వం



వీరఘట్టం మండలం హుస్సేనుపురంలో జనసందోహంతో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ పాలకొండ అభ్యర్థిని ఎమ్మెల్యే కళావతి

సార్వత్రిక ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండడంతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ప్రచారంలో ఓటర్లతో మమేకమవుతూ దూసుకుపోతున్నారు. వచ్చే నెల 13న జరగనున్న పోలింగ్‌లో ఫ్యాన్ గుర్తుపై ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు ఓటు వేసి తమను గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. గడిచిన ఐదేళ్ల కాలంలో తమ ప్రభుత్వం చేసిన సంక్షేమాభివృద్ధిని ప్రజలకు వివరిస్తున్నారు. రాష్ట్రంలో మరింత మెరుగ్గా సంక్షేమాభివృద్ధి పాలన అందించేందుకు తమకు మరోసారి అవకాశం ఇచ్చి ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని పీఠంపై కూర్చోబెట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



సీతానగరం మండలంలోని పాపమ్మవలసలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ పార్వతీపురం అభ్యర్థి జోగారావుకు విజయతిలకం దిద్దుతున్న వృద్ధురాలు



ఎన్నికల ప్రచారంలో సాలూరు పట్టణంలోని పెద్దబజారులో ఓటర్లను అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పీడిక రాజన్నదొర

క్లుప్తంగా

పక్కాగా పరిశీలన

- అరకు పార్లమెంట్ నియోజకవర్గం వ్యయ పరిశీలకుడు



సమావేశంలో మాట్లాడుతున్న వ్యయ పరిశీలకుడు గురుకరణ్ సింగ్

పార్వతీపురం: ఎన్నికల నిర్వహణలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, వీడియో వ్యూయింగ్ బృందాలు ఎన్నికల వ్యయాన్ని పక్కాగా పరిశీలించాలని అరకు పార్లమెంట్ నియోజకవర్గం వ్యయ పరిశీలకుడు గురుకరణ్ సింగ్ అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, వీడియో వ్యూయింగ్ బృందాలతో జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో వ్యయ నమోదుపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోటీలో ఉన్న అభ్యర్థులు ప్రచారంలో భాగంగా నిర్వహించే ర్యాలీలు, సమావేశాలు, ఇతర కార్యక్రమాలపై దృష్టి సారించాలని, అందులో ఇమిడి ఉన్న ప్రతి వ్యయాన్ని పరిశీలించాలని స్పష్టం చేశారు. ఎక్కడా ఎలాంటి అశ్రద్ధ చేయరాదని సూచించారు. వ్యయ నమోదులో పాటిస్తున్న విధానాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్, అరకు పార్లమెంట్ నియోజకవర్గం సహాయ రిటర్నింగ్ అధికారి ఎస్ఎస్.శోభిక, వ్యయ విభాగం నోడల్ అధికారి, జిల్లా సహకార అధికారి పి.శ్రీరామూర్తి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

విజయనగరం క్రైమ్: గుర్తు తెలియని వ్యక్తి కేంద్రాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసులు శనివారం అందించిన వివరాలిలా ఉన్నాయి. ఎల్ఐసీ కార్యాలయం నుంచి బాలాజీ జంక్షన్ మధ్య ఉన్న రోడ్డులో గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో ఉండగా స్థానికుల సహాయంతో ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. ఈ మేరకు శనివారం అతను మృతి చెందినట్లు ఆస్పత్రి వైద్యులు ధ్రువీకరించారన్నారు. సుమారు 60 నుంచి 65 ఏళ్ల వయసు కలిగి ఉంటుందన్నారు. ఆచూకీ తెలిసిన వారు వన్‌టౌన్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

మద్యం బాటిల్స్ స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిల్స్‌ను చూపుతున్న ఎస్ఈబీ సీఐ

రాజాం సిటీ: మండల పరిధి కంచరాం గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం బాటిళ్లను ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసి గ్రామానికి చెందిన రౌతు పోలినాయుడు వద్ద 48 మద్యం బాటిళ్లను గుర్తించామని సీఐ బి.శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు వాటిని స్వాధీనం చేసుకుని వ్యక్తిపై కేసు నమోదు చేశామని తెలిపారు. అలాగే అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించామని పేర్కొన్నారు. ఎస్ఐలు చంద్రశేఖర్, శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

దేవీ దండుమారమ్మ ఆలయం వద్ద అన్న సమారాధన



అమ్మవారికి భోగం పెడుతున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో దేవీ దండుమారమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్నసమారాధన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్పీ ఎం.దీపిక హాజరై, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాధువులకు, భక్తులకు భోజనాలను వడ్డించారు అనంతరం ఎం.దీపిక ఆలయ కమిటీ సభ్యులు, ఇతర పోలీసు అధికారులు అమ్మవారి ప్రసాదాలను స్వీకరించారు. ఇటీవల అమ్మవారి పండగ మహోత్సవాలను ఏప్రిల్ 9 నుంచి ఏప్రిల్ 16 వరకూ జిల్లా పోలీస్ శాఖ ఘనంగా నిర్వహించారు. మహోత్సవ ముగింపు వేడుకల్లో జిల్లా ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, ఆర్ఐలు ఎన్.గోపాలనాయుడు, రమేష్, ఆలయ కమిటీ సభ్యులు తాతరాజు, రవీశ్వరుడు, వాసు, శివ, లక్ష్మణ్, వాసు, తదితరులు పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹130	₹230	₹240

అశోక్‌వనంలో గీత

- అదితి రాజకీయ భవిష్యత్తు కోసం మీసాల గీతకు చెక్
- బంగ్లాలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో అడుగుపెట్టనీయని వైనం
- గీతపైనే తప్పులు నెట్టేస్తూ పార్టీ నుంచే గెంటేసేలా ఎత్తుగడ
- అశోక్ కళ్లల్లో ఆనందం కోసం నోరెత్తని చంద్రబాబు
- ఆత్మగౌరవం కోసం 'బంగ్లా'పై గీత తిరుగుబాటు
- విజయనగరంలో రెబల్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో అడుగు
- సొంత సామాజికవర్గ నేతలు, అభిమానులతో కలిసి ప్రచారం

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

అశోక్ బంగ్లా... ఉమ్మడి విజయనగరం జిల్లా టీడీపీ శ్రేణులను కనుసన్నల్లో నేటికీ శాసిస్తోంది. అక్కడ అడుగు పెట్టాలంటే రాచరికానికి గులాంగిరీ చేయాల్సిందే! ఇతర ప్రాంతాల్లో ఆ పార్టీలోని ఎంత పుడింగి నాయకుడైనా, రాజకీయాల్లో ఎంత కొమ్ములు తిరిగినవారైనా అక్కడ తలదించాల్సిందే! ప్రజాస్వామ్య దేశంలో రాజ్యాలు అంతరించిపోయినా విజయనగరంలో మాత్రం దశాబ్దాలుగా ఆ బానిస సంకెళ్లు కొనసాగుతూనే ఉన్నాయి. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభంజనంతో 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఆ సంకెళ్లు తెగాయి. విజయనగరం లోక్‌సభ స్థానానికి పోటీచేసిన అశోక్‌ను బెల్లాన చంద్రశేఖర్, విజయనగరం అసెంబ్లీ స్థానంలో తొలిసారిగా అడుగుపెట్టిన అదితిని కోలగట్ల వీరభద్రస్వామి ఓడించి విజయబావుటా ఎగురవేశారు. దీంతో ప్రజలకు స్వేచ్ఛ లభించినా టీడీపీ నాయకులు మాత్రం ఇంకా అక్కడే రాజుల అడుగులకు మడుగులొత్తుతున్నారు. రాచరికపు జాడ్యాన్ని రాజకీయాల ద్వారా కొనసాగించడానికి అశోక్ కుటిల యత్నాలతో విసిగిపోయి ఆత్మగౌరవం కోసం ఇప్పటికి ఇద్దరు మాత్రమే గీత దాటారు. ఉమ్మడి జిల్లాలో బలమైన సామాజికవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యేలు మీసాల గీత, కొండపల్లి అప్పలనాయుడు (కె.ఎ.నాయుడు) తిరుగుబాటు చేశారు. అశోక్ నిరంకుశత్వాన్ని ఎదిరిస్తూ బంగ్లాకు పోటీగా టీడీపీ కార్యాలయాలను తెరిచి మరీ సవాల్ విసిరారు. కానీ, బంగ్లా దెబ్బకు వారిద్దరి సీట్లు గల్లంతయ్యాయి. ఇంకా గజపతినగరం టికెట్‌పై ఆశతో కె.ఎ.నాయుడు కుక్కినపేనులా పడివున్నా విజయనగరంలో మీసాల గీత మాత్రం ఆత్మగౌరవం కోసం అదితిపై యుద్ధానికి సిద్ధమయ్యారు. రెబెల్ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. తన సామాజికవర్గ నేతలు, అభిమానుల అండగా ఎన్నికల బరిలోకి దిగారు. తనకే గాకుండా టీడీపీలో అనేక మందికి అవమానాలు మిగుల్చుతున్న బంగ్లా బందిఖానాను బద్దలుకొట్టాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నారు.



విజయనగరంలో బంగ్లాకు పోటీగా మీసాల గీత ప్రారంభించిన టీడీపీ కార్యాలయం



టీడీపీ రెబల్ అభ్యర్థిగా ప్రచారం చేస్తున్న మీసాల గీత

కుమార్తె కోసం కుయుక్తులు...

ప్రజల సంక్షేమానికి, జిల్లా అభివృద్ధికి ఏ మాత్రం ఉపయోగపడని రాజరికాన్నే మళ్లీ ప్రజలపై రుద్దడానికి అశోక్ బంగ్లా కేంద్రంగా రాజకీయాలు సాగుతున్నాయి. కుమార్తె పూసపాటి అదితి విజయలక్ష్మి రాజకీయ భవిష్యత్తు కోసం 2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు నుంచే కుయుక్తులు ప్రారంభమయ్యాయి. విజయనగరం మున్సిపల్ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా పనిచేసిన మీసాల గీతకు నాటి నుంచే చెక్ పెడుతూ వచ్చారు. తమది బీసీల పార్టీ అంటూ చంద్రబాబు గొంతు చించుకునే టీడీపీలోనే తూర్పు కాపు సామాజిక వర్గానికి చెందిన ఆమె ఆవేదన మాత్రం ఏ రోజూ వినలేదు. అశోక్ కళ్లల్లో ఆనందం కోసం గీత గోడు పట్టించుకోలేదు. సిట్టింగ్ ఎమ్మెల్యే గీతకు గాకుండా రాజకీయాల్లో ఓనమాలు కూడా తెలియని, ఏ రోజూ ప్రజలకు సేవ చేయని అదితికి 2019 ఎన్నికల్లో చంద్రబాబు టికెట్ ఇచ్చారు. బీసీలకు అన్యాయం చేసిన తండ్రీ కూతుళ్లకు జిల్లా ప్రజలు బుద్ధి చెప్పారు. కానీ ప్రజలపై కోపం గీతపై చూపించారు. ఆమెను ఏరోజూ బంగ్లాలో అడుగుపెట్టనీయలేదు. టీడీపీ కార్యక్రమాలకు పిలిచిందీ లేదు. దీంతో ఆమె విజయనగరంలో ప్రత్యేకంగా టీడీపీ కార్యాలయం పెట్టుకోవాల్సి వచ్చింది.

అశోక్ ఉద్ధరించేందేమిటి?

రాజరికంపై భయ భక్తులతో అమాయకులైన విజయనగరం ప్రజలు దశాబ్దాలుగా అశోక్ కుటుంబాన్ని నెత్తిన మోశారు. వారి ఓట్లతో గెలిచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో మంత్రి పదవులు పొందినా అశోక్ ఏ రోజూ ప్రజల సంక్షేమం, జిల్లా అభివృద్ధి గురించి ఆలోచించిందీ లేదు. తాను చేసింది ఇదీ అని చెప్పుకోవడానికి ఒక్కటంటే ఒక్కటీ కనిపించదు. చివరకు తాను సెల్ఫీ చాలెంజ్‌లో చూపించిన విజయనగరం ఔటర్ రింగ్‌రోడ్డు కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే నిర్మాణం పూర్తికావడం గమనార్హం. ఆయన చొరవ తీసుకొని చేసిందీ ఏదైనా ఉందంటే అది ఆయన బంగ్లాకు వెళ్లే ఆర్‌ఓబీ (సంతకాల వంతెన) మాత్రమే. ఒకప్పుడు విజయనగరం సామ్రాజ్యంలో చిన్న మత్స్యకార గ్రామమైన విశాఖ ప్రపంచంలోనే మేటి నగరంగా ఎదిగింది. కానీ ఆ రాజ్యానికి ముఖ్యనగరమైన విజయనగరం 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చేంత వరకూ ఒక పెద్ద పల్లెటూరుగానే మిగిలిపోయింది. ఇన్నాళ్లకు ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి చొరవతో విజయనగరం రూపురేఖలు మారాయి. కార్పొరేషన్ హోదాకు తగ్గట్టుగా సదుపాయాలు సమకూరాయి. నగర వాసులు సేదతీరేందుకు, కుటుంబంతో కలిసి కాసేపు ఆహ్లాదంగా గడిపేందుకు వీలుగా పర్యాటక ప్రదేశాలు, పార్కులు ముస్తాబయ్యాయి. చరిత్రకు సాక్షిగా నగరంలోని కూడళ్లు ఆధునిక సొబగులు అద్దుకున్నాయి.

గీత ఆశలు అడియాసలు...

'మీరు మా కుటుంబ సభ్యులు. మీ భవిష్యత్తుకు ష్యూరిటీ మాది' అంటూ చంద్రబాబు, లోకేశ్ చెప్పిన మాటలు మీసాల గీతలో ఆశలు కలిగించాయి. 2019 ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత విజయనగరానికి మూడేళ్ల పాటు ముఖం చాటేసిన అదితికి మళ్లీ టికెట్ ఇవ్వరని, బీసీ మహిళగా తనకు అవకాశం ఇస్తారని భావించారు. తీరా ఎన్నికల సమయం రాగానే అశోక్ మళ్లీ తన కుమార్తె అదితికే విజయనగరం టికెట్ దక్కేలా చక్రం తిప్పారు. గీతకు మాత్రం పూటకో చోట టికెట్ ఆశ చూపిస్తూ చుక్కలు చూపించారు. నెల్లిమర్ల, గజపతినగరం, ఎచ్చెర్ల, చీపురుపల్లి అసెంబ్లీ స్థానాలతో పాటు విజయనగరం లోక్‌సభ టికెట్ కూడా ఆమె పేరు పరిశీలిస్తున్నట్టు ఎప్పటికప్పుడు చంద్రబాబు, లోకేశ్ మభ్యపెడుతూ వచ్చారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో బరిలోకి దిగే టీడీపీ అభ్యర్థుల జాబితాలో గీత పేరు గల్లంతయ్యింది. ఆమె ఆశలు అడియాసలయ్యాయి. దీంతో ఆమె తన సత్తా చాటుకునేందుకు బరిలో దిగారు. అదితి కంటే అధిక ఓట్లు సాధించడమే లక్ష్యంగా తన అనుచరులతో కలిసి ప్రచారం చేస్తున్నారు.

సర్కారు వారి సాయంతో..!

- శిక్షణతో పొందుతూ..ఉపాధి సాధిస్తూ
- స్థిరపడుతున్న యువత
- గుమ్మలక్ష్మీపురం వైటీసీలో కొనసాగుతున్న ఉపాధి శిక్షణ
- ఏపీ స్కిల్‌హబ్ పేరుతో కూడా ట్రైనింగ్

గుమ్మలక్ష్మీపురం: నిరుద్యోగ యువతకు ఆసక్తి ఉన్న రంగాల్లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలిగేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వారికి సాయం చేస్తూ బాసటగా నిలుస్తోంది. ఈ నేపథ్యంలో గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలోని వైటీసీ (యూత్ ట్రైనింగ్ సెంటర్)లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, మెడికల్ రికార్డ్ అసిస్టెంట్, రిటైల్ స్టోర్ మేనేజర్, డ్రైవింగ్ వంటి కోర్సుల్లో 240 మందికి ఇప్పటి వరకు శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం డేటా ఎంట్రీ ఆపరేటర్, నర్సింగ్ కోర్సుల్లో 30 మంది చొప్పున 60 మందికి శిక్షణ ఇస్తున్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో..

కుటుంబ ఆర్థిక, ఇతర పరిస్థితుల కారణంగా ఉన్నత చదువులు చదవలేక పదో తరగతి, ఇంటర్మీడియట్ వంటి కోర్సులకే పరిమితమైన వారికి ఉద్యోగం చేయాలనే తపన ఉన్నా సరైన నైపుణ్యం కొరవడి వెనుకబడుతున్నారు. అటువంటి యువతకు సుశిక్షితులతో మంచి శిక్షణ ఇప్పించి ఉద్యోగావకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఏపీ నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ హబ్‌లు నిర్వహిస్తోంది. గుమ్మలక్ష్మీపురంలోని పాలిటెక్నిక్ కళాశాలలో 2022 అక్టోబర్‌లో ఏర్పాటైన స్కిల్‌హబ్ శిక్షణ సంస్థ ఇప్పటివరకు నిరుద్యోగ యువత 1140 మందికి ఏసీ/రిఫ్రిజిరేటర్ టెక్నీషియన్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్, టైలరింగ్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజర్, ఫోర్‌వీలర్ టెక్నీషియన్, డ్రైవింగ్ వంటి కోర్సుల్లో శిక్షణ ఇచ్చింది. ఇక్కడ శిక్షణ పొందిన వారిలో 370 మంది ఉద్యోగాలు సాధించారు. ప్రస్తుతం ఇదే స్కిల్ హబ్‌లో కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజర్ కోర్సులో నిరుద్యోగ యువత శిక్షణ పొందుతున్నారు.

భద్రగిరి ప్రభుత్వ ఆర్ఐటీఐలో..

గుమ్మలక్ష్మీపురం మండలంలోని భద్రగిరి ప్రభుత్వ ఆర్ఐటీఐ వద్ద అసిస్టెంట్ ప్లంబర్ కోర్సులో శిక్షణ ఇచ్చేందుకు 240 మందికి ఎంపిక చేయగా..మొదటి విడతగా ప్రస్తుతం 30 మందికి ఈ కోర్సులో శిక్షణ అందిస్తున్నారు.

- వీటితో పాటు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే 700 మందికి ఎంప్లాయిబులిటీ స్కిల్ సెంటర్ (ఈఎస్‌సీ) పేరుతో పార్వతీపురంలోని ఎస్‌వీడీ డిగ్రీ కళాశాల, సాయిరాం డిగ్రీ కళాశాల, పాలకొండలోని తమ్మినాయుడు డిగ్రీ కళాశాల, సాలూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఆన్‌లైన్ ఆఫ్‌లైన్‌లో టాలీ, ఎంఎస్ ఆఫీస్, డిజిటల్ మార్కెటింగ్ వంటి కోర్సుల్లోనూ ఉచిత శిక్షణను అందించింది.



గుమ్మలక్ష్మీపురం వైటీసీలో డేటా ఎంట్రీ ఆపరేటర్ శిక్షణ పొందుతున్న నిరుద్యోగ యువత

శిక్షణ ఇస్తున్నాం..



గుమ్మలక్ష్మీపురం వైటీసీలో నర్సింగ్, డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుల్లో 150 మందికి శిక్షణ ఇచ్చేందుకు అనుమతులు రాగా ప్రస్తుతం రెండు కోర్సుల్లో 60 మంది నిరుద్యోగ యువతీ యువకులకు శిక్షణ అందజేస్తున్నాం. ఈ బ్యాచ్ ముగియగానే మళ్లీ మిగతా 90 మందికి శిక్షణ అందజేస్తాం. అంతే కాకుండా ఈ వైటీసీలోనే గిరిశిఖర గ్రామాల గర్భిణుల వసతి గృహాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నాం.

– ఎస్.రాము, మేనేజర్, గుమ్మలక్ష్మీపురం వైటీసీ

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

రేగిడి/పాలకొండ రూరల్:

విజయనగరం జిల్లా రేగిడి మండలంలోని బొడ్డవలస గ్రామంలో చెరకు పంటకు నీరు పెట్టేందుకు వెళ్లిన రైతు విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. ఈ సంఘటనపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మన్యం జిల్లాలోని పాలకొండ మండలం అంపిలి గ్రామానికి చెందిన రైతు ఆలుబిల్లి అప్పలనాయుడు(60) శనివారం ఉదయం నాగావళి నదికి ఆవలివైపు ఉన్న రేగిడి మండలంలోని బొడ్డవలసలో మోటార్ బోరు ద్వారా పంటకు నీటిని అందించే క్రమంలో పంప్‌షెడ్ వద్ద విద్యుత్ షాక్‌కు గురయ్యాడు.

ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో మృత్యువాతపడ్డాడు. కొద్ది సేపటి తర్వాత ఈ ప్రమాదాన్ని గుర్తించిన సహచర రైతులు మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. జీవనాధారమైన కుటుంబ పెద్ద పొలంలో మరణించడాన్ని చూసిన కుటుంబసభ్యులు గుండెలు పగిలేలా రోదించారు. అందరితో కలివిడిగా ఉండే అప్పలనాయుడి మరణ వార్తతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. అంపిలి గ్రామస్తులు, వైఎస్ఎంపీపీ వాకముడి అనిల్‌కుమార్, సర్పంచు లోలుగు విశ్వేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకుని మృతుని భార్య నాగమ్మ, ముగ్గురు పిల్లలను ఓదార్చారు. ఈ ఘటనపై రేగిడి పోలీసులు కేసు నమోదు చేశారు.



రేగిడి: పంపుషెడ్ వద్ద మృతి చెందిన రైతు, (ఇన్‌సెట్లో) ఆలుబిల్లి అప్పలనాయుడు (ఫైల్)

హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధ

- డీఎంహెచ్ జగన్నాథ రావు
- పీహెచ్‌సీల సిబ్బందితో సమావేశం

పాలకొండ: హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని పార్వతీపురం మన్యం జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి బగాది జగన్నాథరావు సూచించారు. ఈ మేరకు శనివారం ఆయన పాలకొండ పట్టణంలోని కల్యాణ మంటపంలో వీరఘట్టం, పాలకొండ మండలాలకు చెందిన పీహెచ్‌సీల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీగా నమోదు జరిగిన నాటి నుంచి ప్రసవం వరకు పూర్తిస్థాయి ఆరోగ్య పర్యవేక్షణ చేయాలని సిబ్బందికి సూచించారు. మొదటి త్రైమాసకంలో గర్భిణుల రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయాలని దీని ద్వారా వైద్య పరీక్షలు జరిగి హైరిస్క్ గర్భిణులను గుర్తించడంతో వైద్యం అందించే అవకాశం ఉంటుందని చెప్పారు. వారి ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతాలను స్పష్టంగా నమోదు చేయాలని అప్పుడే ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సహాయం అందుతుందన్నారు. వైద్యసిబ్బంది తీసుకోవాల్సిన చర్యలను సమావేశంలో వివరించారు. ఆయనతో పాటు డీఐఓ నారాయణరావు, డీఎంఓ టి. జగన్‌మోహన్ రావు, ప్రోగ్రామ్ అధికారి రఘుకుమార్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ



పాల్గొన్న వైద్యసిబ్బంది

వెదుళ్లవలసలో హత్య

- అల్లుడిని హతమార్చిన అత్త, మామ, భార్య

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలంలోని వెదుళ్లవలస గ్రామంలో హత్య జరిగింది. గ్రామంలోని యాత వీధిలో అత్త, మామ, భార్య ముగ్గురూ కలిసి శుక్రవారం రాత్రి 10 గంటల సమయం దాటిన తరువాత కొలుసు అప్పన్న (30)ను హత్య చేయటంతో గ్రామం ఒక్కసారిగా ఉలిక్కి పడింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని యాతవీధిలో కొలుసు అప్పన్న, భార్య దేవి,అప్పన్న అత్త, మామలు ముంత సన్యాసిరావు, ఎల్లమ్మలు ఒకే ఇంటిలో ఉంటున్నారు. మృతునికి అత్తమామలు సొంత అక్క, బావ కాగా మేనకోడలిని వివాహం చేసుకున్నాడు. అప్పన్న లారీ క్లీనర్‌గా పని చేస్తూ అప్పుడప్పుడు ఇంటికి వస్తుంటాడు. భార్యాభర్తల మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో అప్పన్నను హతమార్చాలనే ఉద్దేశంతో శుక్రవారం రాత్రి భార్య, అత్తమామ లు కలిసి హత్య చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.